



- ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు తీపి కబురు
- 29న నగదు డ్రా చేసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7.59 లక్షల మందికి లబ్ధి
- రెండు నెలలుగా పెన్షన్ తీసుకోని వారికి నగదు చెల్లింపునకు ఏర్పాట్లు

పింఛన్లు.. ఒక రోజు ముందే



గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ ఆదివారం.. సెలవు. అంటే వచ్చే నెలలో పింఛన్ ఒకరోజు ఆలస్యంగా అందుతుంది. ఎలా అని ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులు ఆలోచనలో ఉన్నారు. అయితే వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డిసెంబరు నెల పెన్షన్ ఒక రోజు ముందే అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో నవంబరు 30వ తేదీ శనివారమే పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, ఆయా వ్యాధుల చేత బాధింపబడేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 29వ తేదీనే పెన్షన్ సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేయాలని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. శనివారం సచివాలయ ఉద్యోగులందరూ పెన్షన్ పంపిణీ కోసం అందుబాటులో ఉండాలని జిల్లా అధికారులు వారికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం పెన్షన్ పొందని వారికి డిసెంబరు 2న అందజేయనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గుంటూరు జిల్లాలో 2,55,258 మందికి, పల్నాడు జిల్లాలో 2,75,070 మందికి, బాపట్ల జిల్లాలో 2,29,635 మందికి ఒక రోజు ముందే పెన్షన్ చేతికి రానుంది. గత ప్రభుత్వ హయాంలో నెల మొదటి తేది సెలవు దినమైతే ఆ మరుసటి రోజు పెన్షన్ పంపిణీ చేసే వారు. అందువల్ల పెన్షన్‌దారులు కొంత ఇబ్బంది పడే వారు. సెలవులు వరుసగా రెండు, మూడు రోజులు వచ్చినప్పుడు కూడా అప్పటి ప్రభుత్వం పెన్షన్‌దారులను (మిగతా 6వ పేజీలో..)

రైతులకు.. రాయితీలు

- అన్నదాతలకు ప్రభుత్వం అండ
- యంత్ర పరికరాలు మొదలు రుణాల వరకు లబ్ధి
- వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కిన పథకాలు పునరుద్ధరణ
- ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లోనూ పెద్ద ఎత్తున కేటాయింపులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.700 కోట్ల వరకు లబ్ధి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గడచిన ఐదేళ్లు రైతుల సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా వ్యవసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన ఘనత వైసీపీది. 2014–19 మధ్య కొనసాగిన అనేక పథకాలకు గత పాలకులు మంగళం పాడారు. ఇక కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో నిబంధనాల చట్రంలో వారిని బిగించేశారు. విత్తన రాయితీలు, వ్యవసాయ అనుబంధ పాడిపరిశ్రమకు ఊతమిచ్చే అనేక కార్యక్రమాలను అటకెక్కించిన గత పాలకులు అన్నదాతల వెన్ను విరిచారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉండేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో గతంలో రైతులకు అందించిన అన్ని రాయితీలను తిరిగి పునరుద్ధరించింది. ఇందుకు సంబంధించి రైతు సేవా కేంద్రాలు రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాయి. మొన్నటి బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన యంత్రపరికరాలను వ్యక్తిగతంగా రాయితీపై అందించేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పి గ్రూపుల పేరిట వైసీపీ శ్రేణులకు లబ్ధి చేకూర్చింది. ప్రస్తుతం యంత్ర పరికరాలను తిరిగి రైతులకు వ్యక్తిగతంగా అందించడానికే కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోంది. తైవాన్ స్ప్రేయర్ల విషయంలో రైతులకు 8 నుంచి 10 వేల వరకు రాయితీని అందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన ట్రాక్టర్, నూర్పిడి యంత్రాలతో పాటు అత్యాధునికంగా మార్కెట్‌లోకి వచ్చిన వ్యవసాయ అనుబంధ యంత్రాలను రాయితీపై అందించే విధంగా ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి (మిగతా 6వ పేజీలో..)

6

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి

అభిమానుల అభిరుచికి తగిన సినిమాలతో ముందుకు వస్తా



- బుర్రిపాలెంలో సినీ హీరో గల్లా అశోక్

1, 2, 6, 7 తేదీల్లో శబరి ప్రత్యేక రైళ్లు

కోడిగుడ్డు ధర.. పైపైకి

- మరింత పెరగవచ్చంటోన్న వ్యాపారులు 8

నీటి సంఘాల ఎన్నికలకు... సిద్ధం కావాలి

- 5న ప్రకటన జారీ.. 8న ఎన్నికల నిర్వహణ
- ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలి
- సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎన్నికల నిర్వాహణపై జలవనరులు, రెవెన్యూశాఖాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయకట్టు భూములలో పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ ఓటు హక్కు ఉండాలని చెప్పారు. డిసెంబరు 8న నీటి సంఘాల ఎన్నికల నిర్వాహణకు అధికారులు ఎక్కడికక్కడ ముందస్తుగా చేసుకోవాలన్నారు. శాంతిభద్రతల సమస్యలు రాకుండా పోలీసు యంత్రాంగం బందోబస్తు నిర్వహించాలన్నారు. డిసెంబరు 5న ఎన్నికల ప్రకటన జారీ చేయాలన్నారు. 8న నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 1944 టెరిటోరియల్ నియోజకవర్గాల్లో ఒక్కొక్క సభ్యుడి ఎన్నిక జరగాలన్నారు. 170 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరపాలన్నారు. డిసెంబరు 11న 22 డీసీ (కాల్వలకమిటీ) ఎన్నికల జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్, జలవనరులశాఖ ఎస్ఈ అబూతలీమ్, ఈఈ వెంకటరత్నం, అధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల 30న పంపిణీ చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. డిసెంబరు 1న ఆదివారం వచ్చినందున ఆ నెలకు సంబంధించిన పెన్షన్ ఒకరోజు ముందుగానే పంపిణీ చేయాలని చెప్పారు. జిల్లా, మండల అధికారులతో గురువారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. పింఛన్‌ను ముందస్తుగా ఇస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియపర్చాలన్నారు. శనివారం ఉదయం 5.30గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. ప్రతిగంటకు సమాచారాన్ని కలెక్టరేట్‌కు చేరవేయాలన్నారు. నూరుశాతం ఒకేరోజు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ వెంకటమురళి, ఏఎస్పీ విఠలేశ్వర్

కొనసాగుతున్న ఒకటో నెంబర్ ప్రమాద సూచిక



నిజాంపట్నం హార్బర్‌లో 1వనెంబర్ ప్రమాదసూచిక

నిజాంపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో నిజాంపట్నం హార్బర్‌లో రెండో రోజు గురువారం ఒకటో నెంబర్ ప్రమాదసూచిక కొనసాగుతుందని పోర్టు కన్జర్వేటర్ మోకా వెంకటరామారావు తెలిపారు. సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉందని మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళరాదని సూచించారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులు వెనుతిరిగి హార్బర్‌కు చేరుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

ప్రపంచ విక్టోరియల్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 132వ ప్రపంచ విక్టోరియల్ ఫొటోగ్రఫీ వేడుకలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఈ వేడుకల్లో 25 మందికి మెమోరియల్ అవార్డులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ వేడుకలను జర్నలిజం విభాగంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగిన వారికి ఫొటో కాంటెస్ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో నిష్ణాతులై ఉండి మరణించిన వారి పేరు మీద 25 మెమోరియల్ అవార్డులకు ఫొటోలు ఎంపిక చేసినట్లు వివరించారు. అవార్డులు పొందిన ఛాయా చిత్రాల ప్రదర్శనను ఈ వేడుకల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. విజేతలకు బంగారు పతకంతో పాటు నగదు బహుమతులను కూడా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అందజేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గురువారం అవార్డులు పొందిన వారి వివరాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సురేష్ కుమార్, జర్నలిజం విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ జె.మధుబాబు, ఫొటోగ్రఫీ కోర్స్ అతిథి అధ్యాపకులు టి.శ్రీనివాస్ రెడ్డి, ఫొటోగ్రాఫర్ జి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

● వరగాని చెక్‌పోస్ట్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ


వరగాని చెక్‌పోస్ట్ వద్ద రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు

పెదనందిపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వరగాని గ్రామానికి చెందిన తూమాటి శ్యాంసన్ (55), దేవరపల్లి జాన్ (14) ఇద్దరూ టీవీఎస్ మోపెడ్ ద్విచక్ర వాహనంపై పొన్నూరు రోడ్డులో నుంచి గుంటూరు-పర్చూరు రహదారిలోకి వస్తున్న క్రమంలో గుంటూరు వైపు నుంచి పత్తి విత్తనాల లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్‌ఐ ఏకనాథ్ తెలిపారు. పరారైన లారీ డ్రైవర్‌ను పట్టుకుని లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

8 ఇసుక ట్రాక్టర్లు సీజ్



కొల్లిపర, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని బొమ్ము వానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ఎస్‌ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆ ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించడంతో తహసీల్దార్ సిద్ధార్థ జరిమానా విధించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల వితరణతో రెండో బస్సు

● రూ.35 లక్షల విరాళం ప్రకటించిన వైద్యులు



సుందరాచారికి లేఖను అందజేస్తున్న సునీల్ నాయక్, శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలకు దాతల సహకారంతో రెండు కొత్త బస్సులు సమకూరనున్నాయి. ఈ రెండు నూతన బస్సులను 1999వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అందజేయనున్నారు. గత వారం ఈ బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు రూ.40 లక్షల వ్యయంతో 60 సీట్ల కెపాసిటీతో కొత్త బస్సును కాలేజీకి విరాళంగా ప్రకటించారు. వైద్య విద్యార్థుల అవసరాలకు మరో బస్సు కూడా అవసరమని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి కోరడంతో ఇదే బ్యాచ్‌కు చెందిన ఏడు మంది పూర్వ విద్యార్థులు రూ.35 లక్షలతో రెండో బస్సును విరాళంగా అందజేసేందుకు గురువారం ముందుకు వచ్చారు. విరాళం ప్రకటించిన వారిలో అమెరికాకు చెందిన ఎన్నారై వైద్యులు రుమటాలజిస్ట్ సాహిత్య మల్లిపెద్ది, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర్ కాటూరు, ఇంకా ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ యెల్లినేడి (హైదరాబాద్), ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ శ్రీకాంత్‌రెడ్డి బసిరెడ్డి (తిరుపతి), ఆప్తమాజిస్ట్ సదాశివరావు తిమ్మసార్తి (హైదరాబాద్), ఆర్థోపెడిక్ సర్జన్ నరేష్‌రెడ్డి యర్రం (తెనాలి), ఆప్తమాలజిస్ట్ సునీల్ కుమార్ నాయక్ బుక్కె (విజయవాడ) ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దాత డాక్టర్ సునీల్ కుమార్ రెండో బస్సు విరాళానికి సంబంధించిన పత్రాలను గురువారం డాక్టర్ సుందరాచారికి అందజేశారు. కాలేజీ గ్రంథాలయ ఆధునికీకరణకు, కొత్త జర్నల్స్ అందజేసేందుకు 99వ బ్యాచ్ విద్యార్థులు సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 1999వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావుతో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

అభిమానుల అభిరుచికి తగిన సినిమాలతో ముందుకు వస్తా

● బుర్రిపాలెంలో సినీ హీరో గల్లా అశోక్

తెనాలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభిమానుల అభిరుచికి తగ్గట్టుగా రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తానని సినీ హీరో గల్లా అశోక్ చెప్పారు. హీరో సినిమాతో సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో గల్లా అశోక్. ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు, ప్రిన్స్ మహేష్‌బాబు మేనల్లుడుగా గల్లా అశోక్ తెలుగు ప్రజలకు సుపరిచితుడే. తన తాత సూపర్‌స్టార్ కృష్ణ, మేనమామ ప్రిన్స్ మహేష్‌బాబు దత్తత గ్రామమైన బుర్రిపాలెంకు గురువారం వచ్చి సందడి చేశారు.

గ్రామంలో తన తాత సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇటీవల విడుదలైన దేవకీనందన వాసుదేవ చిత్రం సూపర్‌హిట్ కావడంతో అభిమానులతో కలసి ఆనందాన్ని పంచుకున్నారు. తొలుత గ్రామంలోకి విచ్చేస్తున్న అశోక్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని పలు ఆలయాల్లో హీరో అశోక్ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కృష్ణ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ మామ ప్రిన్స్ మహేష్ బాబుతో కలిసి చిన్నతనంలో నాని చిత్రంలో నటించానని ఇప్పుడు హీరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చానని చెప్పారు. మహేష్‌మామ అభిమానులు తొలి సినిమా నుంచి నన్ను అభిమానిస్తూ ఇండస్ట్రీలో స్టార్‌గా నిలబెట్టారని చెప్పారు. దేవకీనందన వాసుదేవ చిత్రాన్ని సూపర్‌హిట్ చేసిన ప్రేక్షకులకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌ను చూసేందుకు మహేష్ బాబు, కృష్ణ అభిమానులు గ్రామానికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.


మీడియాతో మాట్లాడుతున్న హీరో గల్లా అశోక్

'డ్వాక్రా'సభ్యులు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి

● లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి

గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులు సామాజిక అంశాల్లో విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని గుంటూరు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి అన్నారు. యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా ఓల్డ్ గుంటూరు విభాగం ఆధ్వర్యంలో గురువారం పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై డ్వాక్రా సంఘాలకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లీడ్ బ్యాంకు మేనేజర్ సామాజిక భద్రత, డిజిటల్ అక్షరాస్యత, ఫోన్ పే, గూగుల్ పే గురించి మహిళలకు అవగాహన కల్పించారు. సామాజిక ఆర్థిక, కేంద్ర పథకాలలో వీధి వ్యాపారులు వారి కుటుంబం సభ్యులను నమోదు చేయాలని సూచించారు. వీధి వ్యాపారుల ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయించాలని, మొబైల్ యాప్ డౌన్లోడ్ చేయడం, పెండింగ్ రుణాల పంపిణీ చేయడం వంటి విషయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మి,మెప్మా సీఓ సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ మహిపాల్‌రెడ్డి

సోషల్ మీడియా నిందితుడికి రిమాండ్

రెంటచింతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనుచిత పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి మళ్లీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించిన సంఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలు మేరకు.. ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని అలియాస్ జాన్, మస్తాన్ వలి సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టారు. దీనిపై రెంటచింతల టీడీపీ నేత సన్నెగంటి సిద్దయ్య ఈ నెల 13న స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మహబూబ్ సుభానిని మాచర్ల కోర్టులో హాజరు పర్చగా జామీన్ ఎవరూ లేకపోవడంతో మెజిస్ట్రేట్ శ్రీనివాస్ కల్యాణ్ నెల్లూరు జైలుకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ జి.వెంకటాద్రి గురువారం తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, ఫుల్‌హ్యాండ్స్ గోధుమ రంగు చొక్కా ధరించి 35-40 సంవత్సరాల వ్యక్తి కౌంటర్ ముందు భాగంలో పడి చనిపోయి ఉండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. సహజ మరణమై ఉండవచ్చునని ఎస్‌ఐ తెలిపారు. వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకి తరలించినట్లు తెలిపారు.

ట్యాంకర్ ఢీకొని ఒకరి మృతి



సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహం

బాపట్ల, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మూర్తి రక్షణనగర్ దగ్గర టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్న వారిని పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణ ఎస్‌ఐ చంద్రవతి తెలిపిన వివరాల ప్రకారం నరసాయపాలెం గ్రామానికి చెందిన దారా సుజనరావు (53) పట్టణంలోని 9వ వార్డు మూర్తి రక్షణనగర్‌లో తన అత్త వారింటికి టీవీఎస్ మోపెడ్‌పై వచ్చి తిరిగి వెళుతుండగా చీరాల వైపు వెళుతున్న ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న సుజనరావు అక్కడికక్కడే మృతి చెందగా, వెనకాల కూర్చున్న దండమూడి ఏసుపాదంకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వైద్యం కోసం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి దివ్యాంగురాలైన కుమార్తె ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పింఛన్లు.. ఒక రోజు ముందే

(5వ పేజీ తరువాయి)

ఇదే రీతిలో ఇబ్బందులకు గురిచేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ నెలలో బకాయిలు కూడా తీసుకోవచ్చు

గతంలో లబ్ధిదారులు ఏ కారణం చేతనైనా ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే తర్వాత నెల ఆ మొత్తం కలిపి ఇచ్చే వారుకాదు. దీంతో లబ్ధిదారులు ఆ మొత్తం నష్టపోయినట్లే. రెండు నెలలు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే పూర్తిగా పెన్షన్ తొలగించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఏ కారణం చేతనైనా వరుసగా రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోతే, మూడో నెలలో రెండు నెలల పాత బకాయి కూడా కలిపి తీసుకునేలా నిబంధనలు మార్పు చేసింది. వరుసగా మూడు నెలల పాటు పెన్షన్ తీసుకోని వారిని పాక్షిక వలసదారులుగా భావిస్తున్నారు. ఆ తర్వాత వచ్చి దరఖాస్తు అందజేస్తే తాత్కాలికంగా నిలిపివేసిన వారి పెన్షన్‌ను పునరుద్ధరిస్తారు. గతంలో ఈ వెసులుబాటు లేదు.

భర్త పెన్షన్ భార్యకు

ఏ కారణం చేతనైనా పెన్షన్‌దారుడైన భర్త చనిపోతే ఆ పెన్షన్‌ను భార్యకు వెంటనే బదలాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భర్త చనిపోయిన పదిహేను రోజుల్లోనే భార్యకు మంజూరు చేస్తారు. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రైతులకు.. రాయితీలు

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రూ.220 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు

కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కౌలు రైతులను ఆదుకోవడానికి కూటమి పాలకులు ప్రత్యేక దృష్టిసారించారు. కేవలం సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరిపెట్టకుండా రుణాలను కూడా వారి దరికి చేర్చేలా ఆదేశాలు జారీ చేశారు. కౌలు రైతులను ఆదుకోవడంలో తమతో పాటు బ్యాంకర్లు కూడా కలిసిరావాలని పాలకులు కోరారు. గడచిన ఐదేళ్లలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వంద కోట్లకు మించి కౌలు రైతులకు రుణాలివ్వలేదు. అలాంటిది ఈ ఆర్థికసంవత్సరంలో దాదాపు రూ.220 కోట్ల వరకు రుణాల ద్వారా కౌలు రైతులు లబ్ధి పొందనున్నారు

ఉద్యాన సాగు రాయితీలు

ఉద్యాన పంటలకు అందించే రాయితీల విషయంలో కూడా ఓ లక్ష్యంలో అధికారులు ముందుకెళుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో కలిపి దాదాపు రూ.90 కోట్ల వరకు ఉద్యాన సాగుకు ప్రోత్సాహకాలు అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటల పెంపకం, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, ఎఫ్‌పీవోలో ఉన్న సభ్యులకు శిక్షణ ఇచ్చి మెరుగైన మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించడం ఇందులో ముఖ్యమైనవి. మల్చింగ్ షీట్లు, పందిళ్ల నిర్వహణకు తోడు విస్తరణ వంటి అనేక పథకాలకు కేంద్రం అందించే మొత్తాలకు మ్యాచింగ్ గ్రాంటు జత చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందించనుంది

రాయితీపై విత్తనాలు

50 శాతం రాయితీపై విత్తనాలు అందించే పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. రాయితీని పదిశాతానికి పరిమితం చేసి రెండేళ్ల పాటు అందించిన వైసీపీ ప్రభుత్వం ఆ తర్వాత దానికి కూడా పూర్తిగా మానేసింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే విత్తనాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. సాగుదారులపై ఎకరానికి దాదాపు 5 నుంచి ఆరు వేల వరకు ఈ రాయితీ విత్తనాల వల్ల భారం తగ్గనుంది. దీని వల్ల ప్రభుత్వంపై మూడు జిల్లాల పరిధిలో అదనంగా పడే భారం దాదాపు రూ.120 కోట్ల వరకు ఉండొచ్చనేది అంచనా.

భూసార పరీక్షలు.. అగ్రి ల్యాబ్‌లు..

ఏ పంటకు నేల అనువుగా ఉంటుందో శాస్త్రీయ పరీక్షల్లో అధ్యయనం చేసి వాటి ఫలితాలను రైతులకు అందించడం ద్వారా వారికి ప్రభుత్వం మేలు చేసినట్లవుతోంది. కానీ గడచిన ఐదేళ్లలో ఒక్క శాంపిల్‌ను కూడా పరీక్ష జరిపి రైతులకు ఫలితాలను అందించిన దాఖలాలే లేవు. ఇక అగ్రిల్యాబ్‌లు సంగతి చెప్పక్కర్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే భూసార పరీక్షలపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా నిర్వహణ ఖర్చులకు నిధులను సైతం జారీ చేసింది. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన వ్యవసాయ బడ్జెట్‌లో కూడా అన్నదాతల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయింపుల జరిపిన సంగతి తెలిసిందే. వీటిలో ముఖ్యంగా కరకట్టల పటిష్టతతో పాటు కాల్వల్లో పూడికతీతలు ప్రధానంగా ఉన్నాయి. వీటికి తోడు రైతు సంక్షేమం కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల వరకు వ్యయం చేసే విధంగా కేటాయింపులు దక్కనుండడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి


డాక్టర్ ఏఈఎస్ రమేష్‌చంద్ర

మాచర్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ ఏపీఆర్‌జేసీ 1980-82 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఏఈఎస్ రమేష్ చంద్ర ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులయ్యారు. కేంద్ర కార్యదర్శి హోదాలో విదేశీ వ్యవహారాల బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే ఆయన భారత రాయబారిగా పది దేశాల్లో సేవలందించారు. ఏపీ, తెలంగాణకు నోడల్ అధికారిగా విదేశీ వ్యవహారాలను కూడా చూశారు. ఈయన ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి పలు డిగ్రీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులవడంపై ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ సరోజినితో పాటు అధ్యాపకులు హేమంబరరెడ్డి, లింగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు రమేష్‌నాయుడు, వెంకటేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక


షేక్ రోషన్

సత్తెనపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ రోషన్ అనే యువతి తొలి ప్రయత్నంలోనే సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా ఎంపికైంది. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో ఐదేళ్ల లా విద్యను 2023లో పూర్తి చేసింది. ఏపీ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. 2024లో జరిగిన సివిల్ జడ్జి నియామక పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించి సివిల్ జడ్జిగా ఎంపికైయ్యారు. ఆమె తల్లి సుజాత స్థానిక కోర్టులో జూనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తండ్రి షేక్ కరిముల్లా సిటీ కేబుల్ కరిముల్లాగా పట్టణ ప్రజలకు సుపరిచితుడు.

పాలిమర్‌ల సాయంతో కాలుష్యాన్ని తగ్గించొచ్చు

● విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని


మాట్లాడుతున్న సీవీ అవధాని

గుంటూరు (విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవశక్తితో సులభంగా కరిగే పాలిమర్‌లను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని పూణెలోని సోమయ్య విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ అఫ్ కెమిస్ట్రీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెర్చ్ ఇండియా ఏఎస్‌ఆర్‌ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో " ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను గురువారం వైభవంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ బ్రోచర్‌ను ముఖ్యఅతిథులు ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూణెలోని సోమయ్య విద్యా విహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అవధాని మాట్లాడుతూ పాలిమర్ సైన్స్, టెక్నాలజీ రంగం ఎన్నో విధాలుగా ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. మరో ముఖ్యఅతిథి కేరళలోని సెయింట్ బెర్చ్‌మన్స్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెంజిత్ థామస్ మాట్లాడుతూ పాలిమర్‌లు ప్లాస్టిక్, రబ్బర్, ఫైబర్స్, ప్యాకేజింగ్, మెడికల్ పరికరాలు వంటి అనేక విభాగాల్లో వినియోగిస్తారని విద్యార్థులకు తెలియజేశారు. మరో ముఖ్యఅతిథి భువనేశ్వర్‌లోని ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయకృష్ణ మాట్లాడుతూ నానోపాలిమర్‌లు చిన్న పరమాణు స్థాయిలో రూపొందించి అధిక నాణ్యత కలిగిన వస్తువులను సృష్టించేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పీజీ కోర్సులలో ఖాళీ సీట్ల వివరాలను వెల్లడించారు. ఎంఏ ఇంగ్లిష్ 8, లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 10, తెలుగు 15, సంస్కృతం 10, హిందీ 10, ఉర్దూ 10, బుద్ధిస్ట్ స్టడీస్ 10, జర్నలిజం 15, సోషియాలజీ 20, సోషల్ వర్క్ 20, రూరల్ డెవలప్‌మెంట్ 15, హిస్టరీ 10, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ 7, పొలిటికల్ సైన్స్ 7, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 10, ఎకనామిక్స్ 15, ఎం కామ్ 17, ఎంఈడీ 20, ఎమ్ఎల్ఐఎస్‌సి 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సీట్లు పొందేందుకు ఏపీపీజీ సెట్ రాయని వారు కూడా అర్హులేనని తెలిపారు.

1, 2, 6, 7 తేదీల్లో శబరి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు, 28 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే ప్రమాణికుల రద్దీ దృష్ట్యా డిసెంబరు 1, 2, 6, 7, 9 తేదీల్లో ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1వ తేదీన నంబరు 07131 కాచి గూడ - కొట్టాయం, 2వ తేదీన నంబరు. 07132 కొట్టాయం - కాచీగూడ, 6వ తేదీన నంబరు 07137 హైదరాబాద్ - కొల్లం, 7వ తేదీన నంబరు 07138 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు గుంటూరు మీదగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని యాత్రీకులు గమనించి ఆయా రైళ్ల సర్వీసులను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసుల అదుపులో హత్య కేసులో నిందితుడు?


నాగరాజు (ఫైల్ ఫోటో)

చేబ్రోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలిక హత్య కేసులో నిందితుడిగా ఉండి, నాలుగు నెలలుగా పరారీలో ఉన్న నిందితుడు నాగరాజు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో 9వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలిక శైలజ జులై 15న హత్యకు గురైంది. పాఠశాలకు వెళ్లిన శైలజ సమీపంలోని నాగరాజు అనే గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్ ఇంటిలో శవమై కనిపించింది.పాఠశాలకు వెళ్లిన బాలిక హత్య కావడం తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే అనుమానితుడు నాగరాజు సంఘటన జరిగిన తర్వాత అదృశ్యం కావటంతోపాటు, సెల్ ఫోన్ వినియోగించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో అతని కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి నాలుగు నెలలుగా శోధిస్తున్నారు. అయితే పోలీసులపై విమర్శలు రావటంతో సవాలుగా తీసుకుని నిందితుడిని పట్టుకోవడం కోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. నిందితుడు రాజమండ్రిలో ఉన్నట్లు తెలియడంతో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

43,251 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 43,722 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,251 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 39,427 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8000	15000
నెంబరు. 5	8000	14000	నెంబరు.5	8500	13500
273	10000	10500	273	8000	13500
341	8000	15500	341	8000	15000
4884	–	–	4884	8000	13500
సూపర్ 10	--	–	సూపర్ 10	10000	11800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16000	తేజ	7500	16000
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

రఘురామపై కస్టోడియల్ హింసకు కారకుడు జగనే : కొల్లా

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఎంపీ రఘురామ కృష్ణంరాజుపై గుంటూరు సీఐడీ కార్యాలయంలో కస్టోడియల్ టార్చర్ జరిగింది నిజమేనని సికింద్రాబాద్‌లోని సైనిక ఆస్పత్రి నివేదిక బట్టబయలు చేసిందని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రఘురామకృష్ణంరాజును పథకం ప్రకారమే జగన్ కక్ష సాధింపులో భాగంగా ఈ దుర్మార్గం జరిగిందని రూఢీ అవుతుందని ఆయన అన్నారు. త్వరలోనే నేర రుజువులతో బయటకు వెల్లడి అవుతుందని కొల్లా చెప్పారు.

అభివృద్ధి కార్యక్రమాలపై ఉప ముఖ్యమంత్రికి ఎంపీ వివరణ


న్యూఢిల్లీలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో చేపట్టే కార్యక్రమాలు గురించి ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్‌కు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ వివరించారు. న్యూఢిల్లీలో కూటమి ఎంపీలకు పవన్‌కల్యాణ్ ఇచ్చిన విందు కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల ఎంపీ ఆయనను కలిసి పలు విషయాలు వివరించి బాపట్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నందీశ్వరుడికి పంచామృతాభిషేకం


నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

కొల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నందీశ్వరుడికి పంచామృతాభిషేకాన్ని విశేషంగా నిర్వహించారు. గురువారం రాత్రి కొల్లూరులోని గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వర, మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస త్రయోదశిని పురస్కరించుకుని నందీశ్వరునికి వివిధ రకాల ఫలరసాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. పూజాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు గాడేపల్లి శివశర్మ నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నాగిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● మండలపరిధిలోని చిలుమూరు ఉభయ రామేశ్వర క్షేత్రంలో భగవత్ గీతాలాపన, భగవన్నామ సంకీర్తన, కోటి దీపోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు.

పాండురంగాపురంలో పశువైద్యశిబిరం

బాపట్లరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి బాపట్ల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని బాపట్ల మండలం పాండురంగాపురంలో నిర్వహించారు. ఇందులో భాగంగా బాపట్లజిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ శంకరరావు, సంగమేశ్వరశాస్త్రిలు ఈ శిబిరంను ప్రారంభించారు. మొత్తం 409 కేసులను పరిశీలించి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పున్నయ్య శాస్త్రి మందులను ఉచితంగా సరఫరా చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు గోపి కృష్ణ, కిరణ్, సాహిత్య, బాపట్ల సమితి సేవాదళ్ కోఆర్డినేటర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అదానీని అరెస్టు చేయాలి

● విశ్రాంత ప్రొఫెసర్ విజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవినీతి అదానీని అరెస్టు చేయాలని విశ్రాంత ప్రొఫెసర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య జిల్లాప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి సీనియర్ నాయకుడు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను లోబర్చుకొని దేశ, విదేశాల్లో అనేక ఆర్థిక లూటీలకు అదానీ పాల్పడుతున్నారని విమర్శించారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ అదానీ దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఒప్పందాలు కుదుర్చుకున్నారని వాటికి సంబంధించి అదానీ అవినీతిని అమెరికా కోర్టు బయట పెట్టిందన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గుదే రాజారావు, కె.నాగేశ్వరరావు, పి.కొండయ్య, ఎన్ బాబురావు, టి.కృష్ణమోహన్, కె.శరత్, టి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానం


నిజాంపట్నం - రేపల్లె రహదారి

నిజాంపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం - రేపల్లె మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. దీంతో ప్రయాణికులు వెతలు తీరనున్నాయని సంక్రాంతిలోపు పనులు పూర్తి చేస్తామని ఏఈ విద్యాసాగర్ తెలిపారు.

పిల్లర్స్‌కే పరిమితమైన అగ్నిమాపక భవనం

- నిధులు విడుదలైనా అభివృద్ధికి నోచుకోని తీరు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం పనులు ప్రారంభించాలి
- కోరుతున్న తీరప్రాంతవాసులు


పిల్లర్స్ వేసి వదిలేసిన అగ్నిమాపక కేంద్రం

రేపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని రేపల్లె పట్టణంలో అగ్నిమాపక కేంద్ర భవనానికి నిధులు మంజూరైనా.. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక కేంద్రం నూతన భవనానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రూ.7 లక్షలతో బేస్‌మెంట్ లెవెల్ పిల్లర్స్ పనులు చేశారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం 2024వరకు అగ్నిమాపక కేంద్రం భవనం అభివృద్ధి పనులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. అగ్నిమాపక కేంద్రం పాతభవనం ఉన్నా ఫైర్ ఇంజన్లు పెట్టుకునే షెడ్లు పూర్తిస్థాయిలో కార్యాలయం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక నూతన భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతో పనులు ప్రారంభించినా వైసీపీ పాలన ఐదేళ్లలో నిధులు ఉన్నా భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో పిల్లర్స్‌కే పరిమితమైన ఈ భవనం కూటమి ప్రభుత్వమైన ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు ప్రారంభించాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాలకు ఇది ఒక్కటే అగ్నిమాపక కేంద్రంగా ఉంది. ఎటుచూసిన 25నుంచి 35కిలో మీటర్ల దూరం ప్రమాదాలు సంభవించినపుడు అగ్నిమాపక శకటం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాక ఒక్కటే అగ్నిమాపక శకటం ఉండటంతో రెండుచోట్ల అగ్నిమాపక ప్రమాదాలు జరిగితే ఒక్కచోట పూర్తిగా కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. 2014టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రెండో అగ్నిమాపక శకటం కోసం ప్రయత్నాలు చేశారు. కానీ ఇప్పటికి ఒక్క అగ్నిమాపక వాహనంతోనే కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి నూతన భవన అభివృద్ధి పనులు ప్రారంభించి రెండో అగ్నిమాపక శకటాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే

● కలెక్టర్ జె.వెంకటమురళి


బాపట్ల చీలురోడ్డు సెంటర్లో పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జేవీ మురళి, సలగల రాజశేఖర్‌బాబు తదితరులు


పార్టీశ్రేణులతో కలిసి పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం బాపట్ల చీలురోడ్డు సెంటర్లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటి చైర్మన్ సలగల రాజశేఖర్ బాబుతో కలిసి పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు విద్య అవసరమని గుర్తించిన సంస్కర్త పూలే అన్నారు. బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ పూలే ఆలోచన విధానాలను అనుసరించాలన్నారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి రాజేష్‌దాసు, హెచ్‌డబ్ల్యూవో డీవీఎస్ నాగరాజు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే వేగేశన

మహిళా విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. చీలురోడ్డు సెంటర్లో పూలే విగ్రహం వద్ద పార్టీశ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అభ్యుదయ భావాలతో అందరికీ విద్యను చేరువచేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్ల మూడి వెంకటేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు పమిడి భాస్కరరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కూచిపూడి శ్యామ్‌సుందర్, పరిశా రమేష్‌గౌడ్, సుజాత, నజ్మా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నివాసం వద్ద..

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నివాసం వద్ద గురువారం పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి సేవలను కొనియాడారు. వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పఠాన్ రాజేష్, నక్కా ప్రకాష్, జి.దుర్గాప్రసాద్, కె.కొండలు, మాణిక్యారావు, నీలాంబరం, జ్యోతిప్రసాద్, దుర్గా పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి : వైసీపీ

జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు కృషి చేస్తామని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. చీలురోడ్డు సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ బీసీ విభా గం జిల్లా అధ్యక్షుడు పీటా వేణు, కర్లపాలెం మండలపార్టీ అధ్యక్షుడు నర్రా ఏడుకొండలు, చల్లా రామయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

సాహితిభారతి ఆధ్వర్యంలో..

పూలే వర్ధంతి సభలో సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహారావు, కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, అబ్దుల్ ఖాదర్ జిలానీలు పూలే సేవలను కొనియాడారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, మారం రవికుమార్, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : సమసమాజ స్థాపనకు, బాలిక విద్యకు జ్యోతిరావు పూలే చేసిన కృషి గొప్పదని అని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇనకొల్లు పోలీసురావు అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త పూలే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎపీఎం శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉషారాణి, ఏవో జలజ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీనిధి ఏజీఎం, మేనేజర్, సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ


కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న పండితులు

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతములు నేత్రపర్వంగా జరిగాయి. భారీ సంఖ్యలో హాజరైన భక్తన సందోహంతో ప్రాంగణం కిటకిటలాడింది. 1500మంది సత్యనారాయణ స్వామి వ్రతములు ఆచరించారు. పండిత ముత్తేవి శ్రీనివాస శశికాంత్ యాజ్ఞీకంలో బావపురి భక్తబృందం, శ్రీలలిత త్రిపురసుందరి పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు సారధ్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లు జీ రఘునాథరెడ్డి, ఎం రమేష్‌బాబు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తదితర ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రతి ఏడాది కార్తీకమాసంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించి విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో 5వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు మేడూరి అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, శ్రీనివాసుల విఖనస మూర్తి, కొల్లిపర ప్రసాదస్వామి, పంగులూరి కౌండిన్య, గూడూరు సాయి వెంకట్, భక్తబృందం ఉప్పాల హరికృష్ణ, బండిరాంబాబు, యశ్వంత్, చంద్రమోహన్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కొల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరుకు చెందిన రాచూరు శిరీష భర్త మృతి చెందడంతో ఆమెకు రెండో వివాహం చేసేందుకు మూడు సంవత్సరాల క్రితం పెళ్లి సంబంధాలు చూస్తుండగా జోడి యాప్‌లో తెనాలికి చెందిన మిరియాల నాగకృష్ణమోహన్ పరిచయం అయ్యాడు. తాను బ్యాంకు ఉద్యోగినని యువతిని, ఆమె కుటుంబ సభ్యులను నమ్మించాడు. మూడు నెలల అనంతరం అతను చెప్పినవి అవాస్తవమని తేలడంతో వివాహం వద్దనుకుని బళ్లారికి చెందిన మరో వ్యక్తితో వివాహం జరిగింది. అప్పటి నుంచి కృష్ణమోహన్ ఆమెను ఫోన్‌లో సందేశాలు ఇస్తూ వేధింపులకు గురిచేయడంతో పాటు యువతి గురించి చెడుగా భర్తకు కూడా ఫోన్‌లో చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. గురువారం కొల్లూరులోని ఆమె ఇంటికి వచ్చి అల్లరి చేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని బాధిత కుటుంబానికి సాయం

పిట్టలవానిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం గ్రామపంచాయతీలోని గుండుబోయన శివకోటిరెడ్డి పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మండల, గ్రామ టీడీపీ నాయకులతో కలిసి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు నగదును అందజేశారు. గృహాం కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వ పరంగా నూతన ఇంటి నిర్మాణానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, స్థానిక టీడీపీ నాయకులు ఏడుకొండలురెడ్డి, నాగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరెడ్డి, ఈఆర్‌వో నాగజ్యోతి, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలోని సంగుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీకి చెందిన గడ్డం పొలయ్యకు సంబంధించిన పూరిల్లు ఇటీవల దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆదేశాల మేరకు కర్లపాలెం మండల రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పోలీసురావు ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి గూడారం వేసుకునేందుకు టార్పాలిన్ పట్టాలు, వంటసామగ్రి అందజేశారు.

ఒకటో తేదీ వైద్యశిబిరం

చెరుకుపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సౌజన్యంతో ఒకటో తేదీ ఆదివారం రక్తనాళాల వైద్యశిబిరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని సంఘ అధ్యక్షుడు విస్సంశెట్టి వాసు తెలిపారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.

టీనేజి ప్రెగ్నెన్సీని తగ్గించటానికి అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీనేజీ ప్రెగ్నెన్సీని తగ్గించటానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం డిస్ట్రిక్‌లెవల్ అడ్వైజరీ కమిటీ అండ్ బాపట్ల డివిజన్ సబ్‌డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీసీపీ, ఎన్‌డీటీ యాక్ట్ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతిస్కాన్ సెంటర్ వద్ద తప్పనిసరిగా యాక్ట్‌బోర్డు ప్రదర్శించాలన్నారు. ప్రతిస్కాన్ సెంటర్ యాజమాన్యం తప్పక నిబంధనలు పాటించాలని ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి స్కాన్‌సెంటర్ రెన్యువల్ చేయించాలని పీసీపీ ఎన్‌డీటీ నిబంధనలకు ఎవరైన వ్యతిరేకంగా పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీవో డాక్టర్ టీ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం సౌజన్య, పీవోఆర్‌బీఎస్ కె.డాక్టర్ రోహిణీ రత్నశ్రీ, డీపీఎంవో గైనకాలజిస్ట్ డాక్టర్ శాంతి వైష్ణవి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సౌందన్య, పి.ప్రసాదరావు, మహ్మద్‌ఖాన్, బి.మరియమ్మ, హెచ్‌ఈ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గులపోటీలు

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఈ పోటీలను డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ పరిశీలించారు. విజేతలకు డిసెంబరు 1వ తేదిన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, ప్రేమ్‌పావని, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల ఆలోచన తుడిచి పెట్టేయాలి

● బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల ఆలోచనలు తుడిచిపెట్టేయాలని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటి చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని గౌతమి గ్రాండ్ హోటల్‌లో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సలగల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అందరం కలిసి బాల్యవివాహాల నిర్మూలనకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

● కొల్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. గురువారం మండలపరిధిలోని పోతార్లంక అంగన్‌వాడీ కేంద్రంలో దోనేపూడి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల పరిధిలోని తల్లిదండ్రులకు బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారుల కుటుంబసభ్యులకు సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం అందించారు. భట్టిప్రోలుకు చెందిన బదూరుల్లాబేగ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శస్త్రచికిత్సకు అవసరమైన ఖర్చుల కోసం ఎమ్మెల్యేను సంప్రదించగా ఆయన రిఫరన్స్ లెటర్ సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపారు. అనంతరం వచ్చిన సహాయనిధి రూ.90 వేలు చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారుని కుటుంబానికి అందజేశారు.

వేమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. జంపని గ్రామానికి చెందిన పెరుగు వరమల్లేశ్వరికి చికిత్స నిమిత్తంగా రూ.37378, కుచ్చెళ్లపాడుకు చెందిన వెల్లబాటి రాజేష్‌కు రూ.26218, పెనుమూడి ఇంద్రావతికి రూ.80 వేలు చెక్కులను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే ఆనందబాబుకు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నందిరాజుతోట శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్లరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలోని శివాలయంలో పరమేశ్వరుడికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, గ్రామ అధ్యక్షుడు కందుల బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

● ఎంపీడీవో శ్రీనివాసరావు


విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 7వ తేదీన మున్సిపల్ హైస్కూల్లో సీఎం చంద్రబాబు హాజరవతున్న సమావేశానికి తల్లిదండ్రులు అందరు వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆద్దూరి శ్రీనివాసరావు ఎంఈవోలకు సూచించారు. కర్లపాలెం మండల విద్యావనరుల కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావు సందర్శించి ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులందరిని కో-ఆర్డినేషన్ చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రులందరు సమావేశానికి హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో టీయూ మనోరంజని, ఎంఈవో-2 ఎస్ విజయశ్రీ, ఎంఐసీ కోఆర్డినేటర్ రాజేష్, ఆర్పీలు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

సచివాలయ, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దుండివారిపాలెంలో ఉన్న సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని అక్కిరాజు దిబ్బ ఎస్సీకాలనీని ఎంపిడివో సందర్శించి అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

● 10లీటర్ల సారా స్వాధీనం 700లీటర్లు బెల్లం ఊట ధ్వంసం


స్వావర్టుపురంలో బెల్లం ఊట ధ్వంసం చేసి స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో వివరాలు తెలియజేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టూవర్టుపురంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు మంగళగిరి ఎస్‌టీఎఫ్ ఈఎస్ మధుబాబు ఆధ్వర్యంలో ఒంగోలు ఏఈఎస్ జనార్దనరావు, బాపట్ల ఏఈఎస్ బి.వెంకటేశ్వర్లు, బాపట్ల,చీరాల సీఐలు పి.గీతిక, పి.నాగేశ్వరరావులు సిబ్బందితో కలిసి ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను గుర్తించి 700లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సారా తయారు చేసినా.. విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారికి ఉపయోగించే నల్లబెల్లం విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అమ్మినవారిపై, వారికి సహకరించిన వారిపై బైండోవర్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు డీ ప్రభుదాసు, ఎస్ మౌనిక, ఏ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు నెలలుగా మురుగు మధ్యే జీవనం

యానాదుల కుటుంబాలకు వ్యకాస జిల్లా కార్యదర్శి శ్రీధర్ పరామర్శ


రాజీవ్ గాంధీకాలనీలో మురుగు మధ్య నివసిస్తున్న యానాదుల కుటుంబాల వారితో మాట్లాడుతున్న శ్రీధర్

బాపట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు తుఫాన్ ముంపునకు గురైన 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీ వాసులను పరామర్శించడానికి వచ్చిన నాయకులు ఇల్లు కట్టిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్ ప్రశ్నించారు? గురువారం ఆయన మూడునెలలుగా మురుగునీటిలోనే జీవనం సాగిస్తున్న యానాదుల కుటుంబాలను పరామర్శించారు. వారు పడుతున్న కష్టాలు పరిశీలించారు. పక్కా ఇల్లు కట్టించి మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పిన నాయకులు నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఇళ్ల మధ్య నిలిచిన మురుగు కూడా తొలిగించలేకపోయారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఒకమాట వచ్చిన తర్వాత మరోమాట అన్నట్లు ఉందన్నారు. వెంటనే కాలనీని సందర్శించి మౌలిక వసతులు కల్పించకపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఖిద్మత్ వారియర్స్

వారంతా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అందరిలా మనకెందుకు అని వెళ్లిపోలేదు.. కష్టాల్లో.. ఆపదల్లో.. ఉన్న వారికి అండగా ఉండేందుకు ముందుకు వస్తున్నారు. మానవత్వాన్ని మించిన మతం లేదని నిరూపిస్తున్నారు. సీలింగ్ వర్క్స్, ఏసీ మెకానిక్‌లు, వెల్డింగ్ పని, పెయింటర్లు, ఇతర చేతి వృత్తులు, కూలీ పనులు చేసుకునే కొందరు యువకులు ఖిద్మత్ టీంగా ఏర్పడి విపత్కర పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందడుగేస్తూ... ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో కోవిడ్ వారియర్స్‌గా ముందుకొచ్చి వెలకట్టలేని సేవలందించారు. పేద, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, పూట గడవని నిరుపేదలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు నిత్యావసరాలు, ఆర్థిక చేయూత అందిస్తున్నారు. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా తమ వంతు సేవలందిస్తూ మానవత్వాన్ని తట్టిలేపుతున్నారు.

- విపత్తుల్లో సహాయక చర్యలు
- కరోనా కాలంలో వెలకట్టలేని సేవలు
- పేద, అనాథ శవాలకు అంత్యక్రియలు
- మానవత్వంతో సేవలందిస్తున్న సభ్యులు
- అధికార యంత్రాంగానికి తోడుగా సేవలు



అగ్నిప్రమాదం సంభవించిన చోట ఫైర్ సిబ్బందికి తోడుగా ఖిద్మత్ టీం సభ్యులు



ఇటీవల మయన్మార్‌కు చెందిన పీజీ విద్యార్థి కొండప్ప అంత్యక్రియల్లో..

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్‌కు పది రోజుల ముందు అంటే 2020, 14న సేవా దృక్పథం కలిగిన మంగళగిరికి చెందిన యాభై మంది యువకులు సమావేశమై ఆపన్నులకు సాయం చేయాలన్న లక్ష్యంతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి 'ఖిద్మత్ టీం'గా నామకరణం చేశారు. సేవా కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందిస్తున్న తరుణంలో కరోనా మహమ్మారి ముంచుకొచ్చింది. కరోనా లాక్‌డౌన్ రెండో రోజు మసీదు వద్ద ఖిద్మత్ టీం సభ్యులకు ఓ యాచకుడు తాగునీరు అందక రోడ్డుపై ప్రాణాపాయ స్థితిలో కనిపించాడు. కొద్ది రోజులకు కోవిడ్‌తో ఓ మహిళ మృతి చెందింది. ఆస్తి తన పేరిట రాయలేదన్న కారణంతో అంత్యక్రియలకు కొడుకు నిరాకరించాడు. విషయం తెలుసుకున్న ఖిద్మత్ టీం సభ్యులు అతడ్ని మందలించి, ఆ మహిళకు అంత్యక్రియలు జరిపించారు. లాక్‌డౌన్ తొలినాళ్లలో జరిగిన ఈ రెండు సంఘటనలూ ఖిద్మత్ టీంపై తీవ్ర ప్రభావం చూపించాయి. అధికారుల అనుమతితో కోవిడ్ వారియర్స్‌గా రంగంలోకి దిగారు. టీం కన్వీనర్ ఆదాం షఫీ టీం సభ్యులకు కోవిడ్ క్లిష్ట పరిస్థితులపై దిశానిర్దేశం చేస్తూ చైతన్యవంతం చేశారు. కోవిడ్‌తో మరణించిన వారిని కనీసం ఆఖరి చూపు చూసేందుకు కుటుంబ సభ్యులు ముఖం చాటేసిన సమయంలో ఖిద్మత్ బృందం అంత్యక్రియలు నిర్వహించింది. లాక్‌డౌన్ సమయంలో పేదలకు, యాచకులకు 40 రోజులపాటు ప్రతిరోజు 300 నుంచి 400 మందికి భోజనం అందించారు. హోం క్వారంటైన్‌లోని బాధితులకు భోజనం సరఫరా చేశారు. కోవిడ్ సమయంలో వచ్చిన రంజాన్ పండుగకు 400 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. లాక్‌డౌన్ తర్వాత కూడా ఖిద్మత్ టీం సేవా కార్యక్రమాలను విస్తృతం చేసింది. తమకీ సమస్య ఉందని ఫోన్ వస్తే వెంటనే స్పందించి సాయం చేస్తున్నారు. వృద్ధులకు నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. వితంతు, ఒంటరి మహిళలు, అనారోగ్య బాధితులు, క్షతగాత్రులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చేయూత అందిస్తున్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు, క్రీడాకారులకు ఆర్థికసాయం అందించారు. ఇంటింటికీ పింఛన్ పంపిణీ లేనప్పుడు వృద్ధులు, దివ్యాంగులను పింఛన్ పంపిణీ కేంద్రాలకు తరలించేవారు. అగ్ని ప్రమాదాల సమయంలో నష్ట నివారణను తగ్గించేందుకు ఫైర్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారు. తుపాన్లు, వరదల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోను, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు అధికారులకు తోడుగా నిలుస్తున్నారు.



కోవిడ్‌తో మృతిచెందిన వారికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఖిద్మత్ టీం సభ్యులు

మయన్మార్ విద్యార్థికి అంత్యక్రియలు

మయన్మార్‌కు చెందిన కొండప్ప అనే విద్యార్థి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ చదువుతూ పాముకాటుకు గురై మృతిచెందాడు. అంత్యక్రియలకు ఎవ్వరూ ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న ఖిద్మత్ బృందం కొండప్ప మృతదేహానికి మంగళగిరి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించింది. బౌద్ధ బిక్షువులు సైతం ఖిద్మత్ టీం సేవలను అభినందించారు. ఎర్రబాలెం గ్రామంలో పాముకాటుతో చనిపోయిన గోమాతను హిందూ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.

ఖర్చంతా ఖిద్మత్ టీం సభ్యులదే...

50 మందితో ప్రారంభమైన ఖిద్మత్ టీం ఇప్పుడు 500లకు చేరింది. అనేక మంది ఖిద్మత్ టీం ద్వారా సేవలందించేందుకు ముందుకు వచ్చారు. సేవా కార్యక్రమాలకు అవసరమైన ఖర్చును సభ్యులే పూర్తిగా భరిస్తున్నారు. రోజువారీ వేతనాలతో తాము సంపాదించిన దాంట్లో నెలకు రూ.200 చొప్పున సేకరిస్తారు. వాటి ద్వారా ప్రతినెలా ఓ పది కుటుంబాలకు వివిధ రూపాల్లో సాయం అందిస్తున్నారు.

మానవత్వ ధీర అవార్డు


కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విశేష సేవలందించిన ఖిద్మత్ టీంను అధికార యంత్రాంగం గుర్తించింది. అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ ఏపీ పోలీసు శాఖ తరఫున ఇచ్చిన అవార్డుల్లో ఖిద్మత్ టీంకు మానవత్వ ధీర పురస్కారాన్ని ప్రకటించగా అప్పటి ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్ ఖిద్మత్ ప్రదానం చేశారు. ఖిద్మత్ సేవలకు మెచ్చిన అనేక స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు పలు విధాలుగా అవార్డులను ప్రదానం చేశాయి.

కులమతాలకు అతీతంగా సేవ



కరోనా సమయంలో జరిగిన అనేక సంఘటనలు మా టీం సభ్యులను ఎంతగానో కలచివేశాయి. ఆపదలో ఉన్న వారికి తమకు చేతనైనంత సాయం చేయాలని నిర్ణయించాం. మా మత పెద్దలు, కుటుంబ సభ్యుల నుంచి మంచి ప్రోత్సాహం, సహకారం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం, సమాజంలో అన్ని వర్గాల నుంచి అందిన ప్రశంసలు మాలో మరింత స్థైర్యాన్ని నింపాయి. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం. ఏ ఆపద వచ్చినా తమను సంప్రదిస్తే సహకారం అందిస్తాం. సమాజంపై బాధ్యత కలిగిన యువత తోటి వారికి సాయం చేసేందుకు ముందుకు రావాలి.

-షేక్ ఆదాం షఫీ, టీం కన్వీనర్




ఖిద్మత్ టీం సభ్యులు

ఉత్తరాఖండ్‌పై మ్యాచ్‌లో ఆంధ్రా పట్టు



లోహిత్ (7 వికెట్లు)



రితిక్ (7 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు పట్టు బిగించింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో భాగంగా తొలిరోజు ఆంధ్రా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 48.4 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా బ్యాటర్లు ఈశ్వర్ రిత్విక్ 47, వరుణ్ సాత్విక్ 43 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ రితిక్ డూహరాన్ 16.4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 18.4 ఓవర్లలో కేవలం 85 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. ఆంధ్రా బౌలర్ ఏఎన్‌వీ లోహిత్ 7.4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 19 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 76 పరుగులు చేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 39 పరుగులు చేశాడు. దీంతో ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 130 పరుగుల ఆధిక్యంలో వుంది.

వెయిట్ లిఫ్టింగ్ విజేత శివాజీ యూనివర్సిటీ

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ కైవసం చేసుకుంది. అలాగే రన్నర్స్‌గా విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిలిచింది. కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఇందులో బెస్ట్ లిఫ్టర్‌గా యూనివర్సిటీ ఆఫ్ ముంబాయికి చెందిన క్రీడాకారిణి సౌమ్య దాల్వి కైవసం చేసుకున్నారు. అలాగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి టి.రేణుక స్ట్రాంగ్ ఉమెన్ కేటగిరీ అవార్డును సొంతం చేసుకున్నారు. విజేతలకు ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి గంగాధరరావు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ పోటీల నిర్వహణకు మహిళలతోపాటు ఆయా యూనివర్సిటీల టీం మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్ సహకరించినందుకు అభినందించారు. 365 మంది మహిళా క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారన్నారు. టెక్నికల్ కమిటీ చీఫ్‌గా వ్యవహరించిన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య, ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ దిల్షా బాబు, డాక్టర్ డి. సూర్యనారాయణ, డాక్టర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని వీసీ ఆచార్య కే గంగాధరరావు చేతుల మీదగా అందుకుంటున్న శివాజీ యూనివర్సిటీ విద్యార్థులు

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి హాజరు

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాట్లపై విద్యాశాఖకమిషనర్ సమీక్ష

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిపై నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారవడంతో విద్యాశాఖ కమిషనర్ గురువారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిసరాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబరు 7న జరిగే సీఎం కార్యక్రమానికి హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ఉన్నతస్థాయికి ఎదిగిన పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో వసతి పొందుతూ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలను నిర్వహించాలన్నారు. పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షఅభియాన్ ఎస్‌పీడీ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, మధుసూధనరావు, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి విలియమ్స్, సోషల్ వెల్ఫేర్ డీడీ జె.రాజాదెబోరా, మహిళా శిశు సంరక్షణశాఖ పీడీ కె.ఉమా, ఉద్యానశాఖాధికారి జెన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, కలెక్టర్ వెంకటమురళి



అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖకమిషనర్ విజయరామరాజు

నూతన భవన సముదాయానికి రూ 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను తెనాలిలోని ఐతానగర్‌కు చెందిన గడ్డిపాటి నాగయ్య చౌదరి, ఉషాబాల విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో కే జే ఎస్ ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు గురువారం చెక్కును అందజేశారు. సామినేని కోటేశ్వర రావు మాట్లాడుతూ దాతలు అంద జేస్తున్న విరాళాలను సద్వినియోగం చేస్తామని అన్నారు. నూతన భవన నిర్మాణంను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేజేఎస్ ఎస్ ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, పాలకవర్గ సభ్యులు రాయపాటి గోపాలకృష్ణ, షైనేని సీతారామయ్య, ఆర్‌వీఆర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ, గడ్డిపాటి మనోజ్ కుమార్, మారుతి వరప్రసాదు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు


కోడిగుడ్డు ధర.. పైపైకి

- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6
- చిల్లర దుకాణాల్లో రూ.7కు విక్రయం
- మరింత పెరగ వచ్చంటోన్న వ్యాపారులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర రోజురోజుకు పైపైకి చేరుతోంది. గుడ్డు ధర హోల్‌సేల్‌లోనే రూ.6కు చేరింది. వంద గుడ్ల ధర రూ.600లుగా పేర్కొంటూ విజయవాడ జోన్ నెక్ వ్యాపారులు ప్రకటించారు. దాంతో సాధారణ చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. అయితే గుడ్డు ధర మరింతగా పెరిగే ఛాన్స్ లేకపోలేదని పౌల్ట్రీ వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు కార్తీకమాసం కావడంతో సాధారణంగా మాంసాహారం, గుడ్ల విక్రయాలు పడిపోతుంటాయి. అయినా కోడిగుడ్డు ధరలు మాత్రం రోజురోజుకు పెరగడం సామాన్య ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు కోడిగుడ్డు అంటే ఇష్టపడని వారుండరు. విభిన్న రకాలుగా ఆహారంలో కోడిగుడ్డును ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్ల డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంతేగాక గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచే కాక తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కోడిగుడ్లు పశ్చిమ బెంగాల్‌కు పెద్దఎత్తున ఎగుమతులు ఉన్నాయని ఫలితంగానే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఈ నెల మొదటి వారంలో 100 గుడ్లు రూ.565 నుంచి రూ.535 వరకు తగ్గి మరలా పెరుగుతూ వచ్చింది. గత వారంలో 100 గుడ్లు రూ.580, రూ.590కు కొనసాగింది. తాజాగా 100 గుడ్లు రూ.600లకు చేరింది. నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల్లో కేక్‌లకు పెద్దఎత్తున కోడిగుడ్లను వినియోగించే అవకాశం ఉందని తద్వారా డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని చెబుతున్నారు. ఫలితంగానే కోడిగుడ్డు ధర ఎన్నడూ లేని విధంగా గణనీయంగా పెరిగింది. దీంతో ఇదే అదునుగా చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ధర కొంతకాలం కొనసాగే అవకాశం ఉంది.



రైల్వేయార్డు... రీమోడలింగ్



డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద ప్రారంభమైన గుంటూరు రైల్వే యార్డు రీమోడలింగ్ పనులు

- మూడు వంతెనల వైపు ట్రాక్ విస్తరణ
- గుంటూరు స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫాంలలో 24 భోగీల రైళ్ల నిలుపుదల
- కోచింగ్ డిపోకు సులభతరం కానున్న రైళ్ల రాకపోకలు
- నూతనంగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నిర్మాణం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేజంక్షన్‌లో అన్నీ ప్లాట్‌ఫాంలలోకి 24 భోగీలు (గరిష్ట సంఖ్య) ఉండే రైళ్లను నిలుపుదల చేసేందుకు అవసరమైన యార్డు రీమోడలింగ్ పనులను రైల్వే శాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగానే మూడు వంతెనల వైపున రోడ్డు ట్రాఫిక్ బ్లాక్‌ని తీసుకొన్నది. 60 రోజుల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేసి ఆ తర్వాత పెండింగ్ యార్డు రీమోడలింగ్ పనులు చేపట్టాలని భావిస్తున్నది. అంతేకాకుండా మూడు వంతెనల వైపు రోడ్డు మార్గంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేయడం ద్వారా 2025వ సంవత్సరం నుంచి శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభమైనా ట్రాఫిక్‌ని ఈ మార్గం నుంచి మళ్లించేందుకు మార్గం సుగమమౌతుంది.

- రైల్వేబోర్డు ఇటీవలే గుంటూరు రైల్వేస్టేషన్‌కు ఎన్ఎస్‌జీ-3 నుంచి ఎన్ఎస్‌జీ-2 కేటగిరీగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే అందుకు తగినట్లుగా సదుపాయాలు ఇక్కడ అందుబాటులో లేవు. ముఖ్యంగా పేరుకు ఏడు ప్లాట్‌ఫాంలు ఉన్నా అందులో 24 భోగీల ఫుల్ లెంగ్త్ రైళ్లను కేవలం 1, 4 ప్లాట్‌ఫాంల మీదనే నిలుపుదల చేయగలరు. మిగతా ప్లాట్‌ఫాంలలో 15 నుంచి 18 భోగీల రైళ్లను మాత్రమే తీసుకోగలరు. ప్రస్తుతం కొన్ని రైళ్లను ఆరో నంబరు ప్లాట్‌ఫాంలోకి తీసుకోవడం వలన ప్రయాణీకులు ఎక్కాల్సిన భోగీలు ప్లాట్‌ఫాం దాటిపోయి ఉంటున్నాయి. దాంతో వాటిల్లోకి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలానే రైలు దిగే సమయంలోనూ ఇక్కట్లు ఎదురౌతున్నాయి. దీని దృష్ట్యా యార్డు రీమోడలింగ్ చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకోసం రూ. 125.16 కోట్లకు పైగా నిధులు కూడా విడుదలయ్యాయి.
- యార్డు రీమోడలింగ్‌లో భాగంగా కొత్తగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంని కూడా నిర్మించబోతున్నారు. అలానే మిగతా ఏడు ప్లాట్‌ఫాంలలో కూడా 24 భోగీల రైళ్లని నిలిపేలా విస్తరిస్తారు. ప్రస్తుతం గుంటూరు కోచింగ్ డిపో మూడు వంతెనల వైపు ఉన్నది. కోచింగ్ డిపోలోకి రైళ్లు వెళ్లాలంటే ఆ సమయంలో గుంటూరు - విజయవాడ రైళ్లను నిలిపేయాలి. అలానే కోచింగ్ డిపోలో భోగీల అమరిక (షంటింగ్) చేసేటప్పుడు కూడా గుంటూరు నుంచి విజయవాడ వైపునకు రైళ్లను పంపే పరిస్థితి లేదు. దీంతో సమయపాలన దెబ్బ తింటున్నది. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించబోతున్న ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నుంచి నేరుగా కోచింగ్ డిపోకి రైళ్లు వెళ్లేందుకు మూడు వంతెనల మీదగా రైలుమార్గాన్ని నిర్మిస్తున్నారు. ఇందు కోసమే ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేశారు.




జిల్లా గ్రంథాలయంలో పూలేకు నివాళి

జ్యోతిబా పూలేకు ఘన నివాళి

- నివాళులర్పించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా
- పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న పూలే విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు విద్య ఒక్కటే మార్గమని పూలే దంపతులు నాడు ఎంతో కృషి చేశారన్నారు. వారి సేవలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కలెక్టర్ అన్సారియా ప్రసంగిస్తూ స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను స్థాపించి మహిళా విద్యకు పూలే, ఆయన సతీమణి కృషి చేశారన్నారు. చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు సమానంగా ఎదిగినప్పుడే వారికి గౌరవమని పూలే భావించారన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ప్రజాసంఘాల ప్రతినిధులు నీలం నాగేంద్రరావు, గంట సుబ్బారావు, దారా అంజయ్య, బంకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

స్థానిక వైసీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, కఠారి శంకర్, దామరాజు క్రాంతికుమార్, బొట్ల సుబ్బారావు, వెన్నపూస వెంకటరామిరెడ్డి, రొండా అంజిరెడ్డి, కె.ఆదెన్న, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

రాజాపానగల్ రోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని పురస్కరించుకుని సిబ్బంది, పాఠకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, అసిస్టెంట్ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి పాల్గొన్నారు.

పూలేకు ఎస్పీ నివాళులు

ఒంగోలు(క్రైం): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఏవో రామ్మోహనరావు, ఆర్ఐలు రమణారెడ్డి, రమేష్‌కృష్ణన్, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

నగర పాలనకు పన్నుపోటు

- 300కు పైగా ప్రభుత్వ భవనాలకు పేరుకుపోతున్న బకాయిలు
- రూ.40 కోట్ల పెండింగ్‌కు రూ.కోటి మాత్రమే వసూలు
- ప్రైవేటు ఆస్తులవి రూ.50కోట్లు.. చెల్లింపులు రూ.20 కోట్లు
- తాగునీటి బకాయిలు రూ.10కోట్లు.. వసూలు రూ.1కోటి
- నిధులు లేక నీరసించిన ఒంగోలు నగరపాలక సంస్థ



ఒంగోలు కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు గుదిబండలా మారాయి. ఏటేటికీ అవి కొండలా పేరుకుపోతున్నాయి. నగర పాలక సంస్థ అభివృద్ధికి జవసత్వాలు ఇచ్చేది ఆర్థిక వనరులే. పన్నుల బకాయిలు కోట్లలో పేరుకుపోవడంతో ఖజానా వెలవెలబోతోంది. యంత్రాంగంలో అలసత్వం, పన్నుదారుల్లో నిర్లక్ష్యమే ఇందుకు కారణం. ప్రధానంగా ప్రభుత్వ ఆస్తుల పన్ను బకాయిలు పెద్ద తలనొప్పిగా మారాయి. 2002 నుంచి బడ్జెట్ లేదనే కారణంతో ఆయా శాఖల నుంచి చెల్లింపులు లేకపోవడం, రెవెన్యూ విభాగం పట్టించుకోకపోవడంతో కోట్లలో బకాయిలు ఉన్నాయి. తాజాగా పన్ను వసూలుకు గడువు ముంచుకొస్తుండడంతో ఇప్పుడు వసూళ్లకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా ఆయా డివిజన్ల వారీగా కేటాయించిన ఆర్ఐలు, సచివాలయ సెక్రటరీలకు బకాయిల వసూలు అన్నది కత్తి మీద సాములా మారింది.

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు పన్ను పోటు పెరిగింది. జిల్లా కేంద్రంలో ఉన్న 300 ప్రభుత్వ భవనాలకు సంబంధించి అసలు రూ.15 కోట్లు పన్ను బకాయి ఉండగా, వడ్డీ రూ.25 కోట్లు ఉంది. దీంతో రూ.40కోట్లు ప్రభుత్వ బకాయిలు ఉండగా, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.34 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, పాత బకాయిలు మరో రూ.14 కోట్లు ఉన్నట్లు సమాచారం. మొత్తం ప్రైవేటుది రూ.50 కోట్లు బకాయి ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో సుమారు రూ.20 కోట్లు వరకు వసూలైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రభుత్వ భవనాల బకాయిలు రూ.40 కోట్లు

నివాస గృహాల ఇంటిపన్నును ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్న నగరపాలక సంస్థ.. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన వాటిపై ఉదాసీనంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లు పన్నులు చెల్లించకపోవడంతో అపరాధ రుసుం కూడా తోడై బకాయిల భారం మరింత పెరిగింది. వాస్తవానికి 2002 నుంచి ఇప్పటివరకు పన్నులు రూ.15కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉండగా, వడ్డీ రూ.25 కోట్లకు పెరిగింది. దీంతో ఆయా శాఖల నుంచి రూ.40 కోట్లు రావాల్సి ఉంది. అందులో ప్రధానంగా పోలీసు శాఖ, ప్రకాశం భవనం, కోర్టు, డీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ, ఎన్నెస్పీ, పంచాయతీరాజ్, బీసీ కార్పొరేషన్, జిల్లా పరిషత్, డ్వామా, రిమ్స్ భవనాల బకాయిలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కార్పొరేషన్ రెవెన్యూ యంత్రాంగం కేవలం నోటీసులతోనే సరిపెడుతుండగా, ఆయా ప్రభుత్వ శాఖలు సైతం పెద్దగా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి కొన్ని శాఖలు అప్పుడప్పుడు చెల్లింపులు చేస్తుండగా మరికొన్ని తమకేమీ తెలియదన్నట్లుగానే వ్యవహరిస్తున్నాయి. వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినా ప్రభుత్వ బకాయిలు మాత్రం వసూలు కాకపోవడంతో నగరపాలక సంస్థ సిబ్బంది డీలాపడుతున్నారు. నిబంధన మేరకు ఆయా శాఖల జీతభత్యాలతోపాటు కార్యాలయ భవనాల అద్దె, విద్యుత్ బిల్లుల చెల్లింపు, వివిధ పన్నులు చెల్లించేందుకు ఏటా బడ్జెట్ విడుదల చేయాలి. అయితే ఈ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో బకాయిల భారం మరింత రెట్టింపై కూర్చుంటుంది.

రెవెన్యూలో 'గూడు' పుఠాణి

ఒంగోలు నగరంలో సుమారుగా 67 వేల వరకు అస్సెస్మెంట్లు ఉన్నాయి. అందులో రెసిడెన్షియల్ 35,402, నాన్ రెసిడెన్షియల్ 7వేలు, పార్టీలీ, నాన్ పార్టీలీ (అన్నీ కలిపి) 4,720 వరకు ఉండగా వాటికి సంబంధించి రూ.22 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. వాటితోపాటు రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు 300 వరకు ఉండగా వీటికి సంబంధించి రూ.40 కోట్లు వసూలు చేయాలి. ఇకపోతే దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో, నగరంలోని పలు ప్రాంతాలలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి సుమారు రూ.4.5 కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంచితే తాగునీటి పన్ను రూ.10 కోట్లు, ప్రైవేటు ఆస్తుల బకాయిలు రూ.50 కోట్లు ఉండటంతో పూర్తిస్థాయిలో వసూలే లక్ష్యంగా కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించారు. అయితే ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పేరుకుపోవడానికి గతంలో ఆర్ఐలుగా పనిచేసిన వారి నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తుంది.

అన్నింటికీ పన్నులే ఆధారం.

అధిక శాతం అభివృద్ధి పనులకు ఆయా మునిసిపాలిటీల ఖజానా నిధులు (జనరల్ ఫండ్)లనే ఉపయోగించాల్సి ఉంది. వాటితో తాగునీటి నిర్వహణ, కాంట్రాక్టు సిబ్బంది జీతాలు, పలు అభివృద్ధి పనులు, విద్యుత్ దీపాలు నిర్వహణ, విద్యుత్ బకాయిలతోపాటు పార్కుల నిర్వహణ, పారిశుధ్యం మెరుగు ఇతరత్రా కొన్ని ఆర్థికపరమైన వాటికి వీటినే వినియోగించాల్సి ఉంది. అయితే పన్ను వసూలు విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో కార్పొరేషన్ ఖజానా బోసిపోతుంది.

డబ్బులు చెల్లించకుండా తాగేస్తున్నారు.

నగరంలో 47వేలకుపైగా గృహాలు ఉండగా, అధికారుల లెక్కల ప్రకారం 26,461 కొళాయి కనెక్షన్‌లు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు పాత బకాయిలతో కలిపి రూ.10కోట్లు తాగునీటి పన్ను వసూలు కావాల్సి ఉంది. కాగా వాటిలోనే గృహ అవసరాలు, వాణిజ్య అవసరాలు, అపార్ట్‌మెంట్‌లు ఇతరత్రా అన్నింటికీ సంబంధించి కొళాయిలు ఉన్నట్లు అధికారుల కాకిలెక్కలు. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే సుమారు 8 వేల వరకు అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే వాటిని తొలగించడం కానీ, క్రమబద్ధీకరించే దిశగా అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదు.

అత్యధిక బకాయి ఉన్న ప్రభుత్వ భవనాలు	
ఎస్పీ కార్యాలయం	రూ.3.53 కోట్లు
ప్రకాశం భవనం	రూ.6.85 కోట్లు
కోర్టు భవనాలు	రూ.80 లక్షలు
డీఆర్‌డీఏ	రూ.3.19 కోట్లు
ఆర్అండ్‌బీ	రూ.1.85 కోట్లు
ఎన్నెస్పీ	రూ.1.17 కోట్లు
పంచాయతీరాజ్	రూ. 77 లక్షలు
బీసీ కార్పొరేషన్	రూ. 1.65 కోట్లు
జిల్లా పరిషత్	రూ. 4.35 కోట్లు
డ్వామా	రూ. 80 లక్షలు
రిమ్స్ భవనాలు	రూ. 1.55 కోట్లు

రైతులకు.. రాయితీలు

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రూ.220 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు

కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి..

గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కౌలు రైతులను ఆదుకోవడానికి కూటమి పాలకులు ప్రత్యేక దృష్టిసారించారు. కేవలం సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరిపెట్టకుండా రుణాలను కూడా వారి దరికి చేర్చేలా ఆదేశాలు జారీ చేశారు. కౌలు రైతులను ఆదుకోవడంలో తమతో పాటు బ్యాంకర్లు కూడా కలిసిరావాలని పాలకులు కోరారు. గడచిన ఐదేళ్లలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వంద కోట్లకు మించి కౌలు రైతులకు రుణాలివ్వలేదు. అలాంటిది ఈ ఆర్థికసంవత్సరంలో దాదాపు రూ.220 కోట్ల వరకు రుణాల ద్వారా కౌలు రైతులు లబ్ధి పొందనున్నారు

ఉద్యాన సాగు రాయితీలు..

ఉద్యాన పంటలకు అందించే రాయితీల విషయంలో కూడా ఓ లక్ష్యంలో అధికారులు ముందుకెళుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో కలిపి దాదాపు రూ.90 కోట్ల వరకు ఉద్యాన సాగుకు ప్రోత్సాహకాలు అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటల పెంపకం, కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటు, ఎఫ్‌పీవోలో ఉన్న సభ్యులకు శిక్షణ ఇచ్చి మెరుగైన మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించడం ఇందులో ముఖ్యమైనవి. మల్చింగ్ షీట్లు, పందిళ్ల నిర్వహణకు తోడు విస్తరణ వంటి అనేక పథకాలకు కేంద్రం అందించే మొత్తాలకు మ్యాచింగ్ గ్రాంటు జత చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందించనుంది

రాయితీపై విత్తనాలు...

50 శాతం రాయితీపై విత్తనాలు అందించే పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. రాయితీని పదిశాతానికి పరిమితం చేసి రెండేళ్ల పాటు అందించిన వైసీపీ ప్రభుత్వం ఆ తర్వాత దానికి కూడా పూర్తిగా మానేసింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే విత్తనాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. సాగుదారులపై ఎకరానికి దాదాపు 5 నుంచి ఆరు వేల వరకు ఈ రాయితీ విత్తనాల వల్ల భారం తగ్గనుంది. దీని వల్ల ప్రభుత్వంపై మూడు జిల్లాల పరిధిలో అదనంగా పడే భారం దాదాపు రూ.120 కోట్ల వరకు ఉండొచ్చనేది అంచనా.

భూసార పరీక్షలు.. అగ్రి ల్యాబ్‌లు..

ఏ పంటకు నేల అనువుగా ఉంటుందో శాస్త్రీయ పరీక్షల్లో అధ్యయనం చేసి వాటి ఫలితాలను రైతులకు అందించడం ద్వారా వారికి ప్రభుత్వం మేలు చేసినట్లవుతోంది. కానీ గడచిన ఐదేళ్లలో ఒక్క శాంపిల్‌ను కూడా పరీక్ష జరిపి రైతులకు ఫలితాలను అందించిన దాఖలాలే లేవు. ఇక అగ్రిల్యాబ్‌లు సంగతి చెప్పక్కర్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే భూసార పరీక్షలపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా నిర్వహణ ఖర్చులకు నిధులను సైతం జారీ చేసింది. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన వ్యవసాయ బడ్జెట్‌లో కూడా అన్నదాతల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయింపుల జరిపిన సంగతి తెలిసిందే. వీటిలో ముఖ్యంగా కరకట్టల పటిష్టతతో పాటు కాల్వల్లో పూడికతీతలు ప్రధానంగా ఉన్నాయి. వీటికి తోడు రైతు సంక్షేమం కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల వరకు వ్యయం చేసే విధంగా కేటాయింపులు దక్కనుండడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్లు.. ఒక రోజు ముందే

(5వ పేజీ తరువాయి)

ఇదే రీతిలో ఇబ్బందులకు గురిచేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ నెలలో బకాయిలు కూడా తీసుకోవచ్చు..

గతంలో లబ్ధిదారులు ఏ కారణం చేతనైనా ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే తర్వాత నెల ఆ మొత్తం కలిపి ఇచ్చే వారుకాదు. దీంతో లబ్ధిదారులు ఆ మొత్తం నష్టపోయినట్లే. రెండు నెలలు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే పూర్తిగా పెన్షన్ తొలగించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఏ కారణం చేతనైనా వరుసగా రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోతే, మూడో నెలలో రెండు నెలల పాత బకాయి కూడా కలిపి తీసుకునేలా నిబంధనలు మార్పు చేసింది. వరుసగా మూడు నెలల పాటు పెన్షన్ తీసుకోని వారిని పాక్షిక వలసదారులుగా భావిస్తున్నారు. ఆ తర్వాత వచ్చి దరఖాస్తు అందజేస్తే తాత్కాలికంగా నిలిపివేసిన వారి పెన్షన్‌ను పునరుద్ధరిస్తారు. గతంలో ఈ వెసులుబాటు లేదు.

భర్త పెన్షన్ భార్యకు...

ఏ కారణం చేతనైనా పెన్షన్‌దారుడైన భర్త చనిపోతే ఆ పెన్షన్‌ను భార్యకు వెంటనే బదలాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భర్త చనిపోయిన పదిహేను రోజుల్లోనే భార్యకు మంజూరు చేస్తారు. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

ఎర్రకొండ పిండి..


వెలుగువారిపాలెంలో ఎర్రకొండ మట్టిని తవ్వి టిప్పర్‌కు నింపుతున్న ఎక్స్‌కవేటర్

- అనుమతులు గోరంత.. తరలింపు బోల్డంత
- వెలుగువారిపాలెం కొండ రూపురేఖలు మాయం
- జాతీయ రహదారి నిర్మాణానికి యథేచ్ఛగా తవ్వకాలు

తాళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ఎర్రకొండను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో కొండ రోజురోజుకూ రూపురేఖలు కోల్పోతోంది. అనుమతులకు మించి గ్రావెల్‌ను తవ్వుతున్నారు. బెంగళూరు హైవే నిర్మాణం పేరిట ఇక్కడ నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. బెంగళూరు నుంచి తాళ్లూరు ప్రాంతం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి మంజూరైంది. గత ఏడాదిగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. హైవే నిర్మాణ మార్గమధ్యంలో వెలుగువారిపాలెం వద్ద సర్వే నంబర్ 489లో 664 ఎకరాల్లో ఎర్రకొండ ఉంది. రోడ్డు నిర్మాణానికి కొండ దగ్గరగా ఉండటంతో కాంట్రాక్టర్ మట్టి, గ్రావెల్ కోసం రెవెన్యూ అధికారులకు, గ్రామపంచాయతీకి దరఖాస్తు పెట్టారు. అప్పటి తహసీల్దార్ కొండను పరిశీలించి పంచాయతీ తీర్మానం మేరకు ఒకటిన్నర హెక్టార్‌లో మట్టిని తవ్వేందుకు మైనింగ్ అధికారులకు ప్రతిపాదనలు పంపారు.ఆ మేరకు మైనింగ్ అధికారులు అనుమతి లభించింది.

అనుమతి ఒకటిన్నరే.. తవ్వేది 25హెక్టార్లలో

అనుమతులు గోరంతగా పొంది తరలింపు మాత్రం కొండంతగా ఉంది. ఈక్రమంలో రోడ్డు నిర్మాణం కోసం ఎర్రకొండ మట్టిని భారీగా తరలించటంతో కొండ పూర్తిగా రూపురేఖలు మారింది. దాదాపు 25హెక్టార్లకుపైగా కొండమట్టిని, గ్రావెల్‌ను తరలించారు. అనుమతికి మించి మట్టిని తోలుతున్నా అప్పట్లో వైసీపీ నాయకులు భారీస్థాయిలో ముడుపులు తీసుకుని మిన్నకున్నారన్న విమర్శలు వచ్చాయి. గత ఏడాది ఫిబ్రవరిలో అనుమతి పొంది మార్చి నుంచి ఆ మట్టిని తోలటం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో హద్దులు దాటి కొండలో తవ్వకాలు చేస్తున్నా అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగిందన్న విమర్శలు వచ్చాయి. కొందరు రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు కూడా. అయితే ముడుపులు తీసుకుని అక్రమ తవ్వకాల గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

కొత్త ప్రభుత్వం వచ్చినా ఆగలేదు

కూటమి ప్రభుత్వంలో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రామస్థులు ఆశించారు. అనుమతి కంటే ఎక్కువ భూమిలో కొండ మట్టిని తవ్వుతున్నారని కొందరు ఫిర్యాదు చేయటంతో అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లినా తరలింపు ఆగలేదు. కొందరు కూటమి నేతలు గ్రావెల్ దందాలో ఉన్న వైసీపీ నేతలతో, రోడ్డు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై మిన్నకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ కొండ నుంచి గ్రావెల్‌ను తరలించి తూర్పుగంగవరం-ఉలపాడు వరకు కొంతమేర రోడ్డు పనులు చేశారు. గతంలో ఈ కొండపై ఏపుగా గడ్డి పెరిగి ఉండటం వల్ల పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకు వెళ్లేవారు. కొండ మట్టిని పూర్తిగా తరలించటంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెలు జారిపడితే కన్పించకుండా పోతాయని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోయినా ఇటీవల వచ్చిన తహసీల్దార్ సంజీవరావు కొండ ప్రాంతాన్ని సందర్శించి నివేదికను జిల్లా అధికారులకు పంపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా మట్టి, గ్రావెల్ తోలకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


డెయిరీలో పన్నీరును పరిశీలిస్తున్న అధికారి ప్రభాకరరావు, సీఐ, ఎస్సై

- ముండ్లమూరు సమీపంలోని శ్రీరామ్ డెయిరీలో తనిఖీలు
- పలు పాల ఉత్పత్తులపై అనుమానాలు
- శ్యాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిన అధికారులు

కల్తీ కలకలం!

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో గత కొన్నేళ్లుగా శరణ్య డెయిరీ, శ్రీరామ్ డెయిరీల్లోని పలు పదార్థాలలో కల్తీ జరుగుతున్నట్లు ఆరోపణలు రావడం, అధికారుల తనిఖీలతో కలకలం రేగింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రేణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి, సిబ్బంది, దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై వై.నాగరాజు సంయుక్తంగా గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరు రకాల పాల పదార్థాల తయారీపై అనుమానాలు వ్యక్తం చేస్తూ శ్యాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ప్రధానంగా పన్నీరు, నెయ్యి, పాలకోవా, బట్టర్ నాన్ లాంటివి తయారుచేసి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వివిధ పట్టణాలకు సరఫరా చేస్తున్నారు.

అత్యాశకు పోయి..

నెయ్యి కేజీ హైదరాబాద్ నగరంతో పాటు పలు ప్రాంతాల్లో రూ.1400 ఉంది. శ్రీరామ్ డైయిరీ సరఫరా చేసేది కేవలం రూ.400 ధర మాత్రమే ఉండటంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వీటితోపాటు పన్నీరు, పాలకోవా లాంటివి ఇతర మార్కెట్‌లో ఉండే ధరలకంటే తక్కువకు విక్రయిస్తుండటంతో అనుమానాలకు ఊతమిచ్చింది. ఈ దాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నర్సింహులు, శివతేజ, వీఆర్వో దయానందం, పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో..

గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న వ్యాపారంపై అనుమానాలు రావటంతో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి ప్రభాకరరావు తెలిపారు. పాలపొడితో పలు రకాల వస్తువులు తయారు చేసిన విషయాన్ని గుర్తించారు. ముందుగానే ఎస్సై నాగరాజుకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేశారు. శరణ్య డెయిరీ జీఎస్‌టీ కూడా లేదని, శ్రీరామ్ డెయిరీ పేరుతో వ్యాపారం సాగిస్తున్నారని సీఐ రామారావు తెలిపారు. కల్తీ పాల దందా ఎక్కువగా దర్శి సర్కిల్ పరిధిలోని ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. త్వరలోనే వారి ఆటలు కట్టిస్తామన్నారు. నివేదిక వచ్చిన వెంటనే నిర్వాహకులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి ప్రభాకరరావు తెలిపారు. కల్తీ పదార్థాలు చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. ప్రధానంగా కల్తీ పాలతో క్యాన్సర్ వ్యాధి వస్తుందని చెప్పారు. ఏ ప్రాంతంలోనైనా కల్తీ పాలతో పాటు వాటితో తయారు చేసే పదార్థాలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. పన్నీరు తయారీ కోసం పాలను విరగ్గొట్టాలని చెప్పారు. కొంత మంది తక్కువ మోతాదులో పలు పౌడర్లు వాడి పన్నీరు తయారుచేస్తున్నారన్నారు. డెయిరీ తయారు చేసే ప్రతి పదార్థాన్నీ జిల్లా ఆహార భద్రతా అధికారి, సిబ్బంది, దర్శి సీఐ రామారావు, ఎస్సై నాగరాజులు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తిచేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కల్చరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10వతేదీ నాటికి పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయటానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి గృహ నిర్మాణాల పురోగతి, ఎంఎస్ఎంఈ సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, స్కూల్ టాయిలెట్స్ తదితర అంశాలపై ఆమె మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరు 12వతేదీన లక్ష ఇళ్లను సామూహికంగా ప్రారంభోత్సవాలు చేపడుతున్నారని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



పుల్లరిపాలెం వద్ద వాగ్వాదానికి దిగిన ఇద్దరు నేతలు

నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. 'నువ్వెవరు... నీకేం పని.. నీకేం అధికారం ఉంది?' అంటూ నియోజకవర్గంలో కూటమిలోని టీడీపీ, జనసేనకు చెందిన ఇరువురు సాక్షాత్తూ ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, వేటపాలెం తహసీల్దార్ పార్వతి సమక్షంలో వాగ్వాదానికి దిగారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై వీడియోలు సోషల్ మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. వాదనకు దిగిన ఇరువురు వ్యక్తుల్లో ఒకరు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు కుమారుడు ఆమంచి రాజేంద్రప్రసాద్ కాగా, రెండో వ్యక్తి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు వేటపాలెం మండలంలో క్రియాశీలకంగా పనిచేసిన రాజేష్‌రెడ్డి కావడం విశేషం. దీంతో అంశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

నువ్వా? నేనా?

- ఆర్డీవో, తహసీల్దార్‌ల ఎదుట టీడీపీ, జనసేన నేతల ఆధిపత్య పోరు
- రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ
- పైకి చెప్పేది ఎస్టీల సమస్య

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేశ్చగా సాగుతున్నాయి. ఇది బహిరంగ రహస్యం. అయితే వేటపాలెం మండలం పుల్లరిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ పార్వతి సిబ్బందితో కలిసి ఫిర్యాదులో పేర్కొన్న ప్రదేశానికి వెళ్లి మూడు రోజులక్రితం విచారణ చేపట్టారు. ఆ క్రమంలో అధికారుల సమక్షంలోనే రాజేంద్ర ప్రసాద్, రాజేష్ రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.

● అక్రమాల లెక్కలన్నీ తీస్తాం.. మేమూ చూస్తాం..

ఫిర్యాదు చేసిన వారి సమస్య ఎలా ఉన్నా ఆ ఫిర్యాదుపై విచారణ జరిపే అధికారుల సమక్షంలోనే రాజేష్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ 'నీకేం పనంటే.. నీకేంపని' అంటూ వాదులాడుకున్నారు. ఆ క్రమంలో ఇసుక దిబ్బలు కొట్టేస్తుంటే గ్రామంలోని వారికి తాగునీటికి ఇబ్బంది ఎదురవుతుందని ఫిర్యాదుదారుల తరపున రాజేంద్రప్రసాద్ వకాల్తా పుచ్చుకుని మాటాడారు. దానికి ప్రతిగా రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ని సంవత్సరాల నుంచి చెరువులు మాదిరిగా ఇసుక తవ్వకాలు జరిగాయి. ఆ లెక్కలన్నీ తీస్తామన్నారు. అందుకు ప్రతీగా తాము సిద్ధమేనని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

● వారిద్దరినీ వారించిన అధికారులు

ఆ ఇద్దరూ ఆధిపత్యపోరుకు సిద్ధపడటంతో అధికారులు వారించారు. ఆ తరువాత ఫిర్యాదుదారులతోనూ, వారి తరుపు సంఘ పెద్దలతోనూ అధికారులు మాట్లాడారు. వాస్తవాలతో కూడిన నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశామని అధికారులు తెలిపారు. రాజకీయంగా ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందోనని రాజకీయ వర్గాలతో పాటు సామాన్యుల్లో చర్చ సాగుతోంది.



మంచినీటి పథకం వద్ద చెట్ల తొలగింపులో ప్రొక్లెయిన్, పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మంత్రి గొట్టిపాటి చొరవతో చిల్లచెట్ల తొలగింపు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో మండలంలోని మణికేశ్వరం మంచినీటి పథకం వద్ద ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు మోక్షం కలిగింది. కొండపై ఉన్న మంచి నీటి పథకం వద్ద చిల్లచెట్లు మొలిచి కనీసం అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఫిల్టర్ బెడ్‌ల వద్ద చెట్ల ఆకులు పడి నీటితొట్లు అపరిశుభ్రంగా మారడంతో ఈ విషయాన్ని గ్రామస్థులు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం టీడీపీ నాయకులు కరిముల్లా, గ్రామస్థులు ఆశోక్, మౌలాలి, ఆదినారాయణ, అబ్దుల్లా, కృష్ణ తదితరులు ఉండి ప్రొక్లెయిన్‌తో ఆ ట్యాంక్ వద్ద ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించడంతో పాటు కొండపైకి దారి వెంబడి ఉన్న చెట్లు తొలగించి రోడ్డున నడిచేందుకు వీలుగా శుభ్రం చేశారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

పర్చూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పర్చూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై మాల్యాద్రిని ఆదేశించారు. ప్రస్తుతం దొంగతనాలు చోటుచేసుకుంటున్న తరుణంలో రాత్రి సమయాల్లో పోలీసు గస్తీని నిర్వహించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్మీ ఉద్యోగి అరెస్టు

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నంకు చెందిన ఆర్మీ ఉద్యోగి పిట్టు నాగరాజురెడ్డిని చీరాల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటకు చెందిన లావణ్య తనను పెళ్లి చేసుకుని మోసగించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతనికి ఇప్పటికే రెండు పెళ్లిళ్ల చేసుకున్నట్లు, మరొకరితో అక్రమ సంబంధం కొనసాగించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం గవినివారిపాలెం గ్రామంలో గురువారం రాత్రి గవిని పోలయ్య (83) వృద్ధుడు మృతి చెంది కాలువ వద్ద పడి ఉన్నాడు. ఈ మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడు బహిర్భూమికి వెళ్లి జారిపడినట్లు పోలీసులు, బంధువులు చెబుతున్నారు.

ఒక రోజు ముందే పెన్షన్‌ల పండుగ

● సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సామాజిక భద్రత పెన్షన్‌ల పండుగ ఈసారి ఒక రోజు ముందే రానుంది. ఈసారి ఒకటవ తేదీ ఆదివారం రావడంతో రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేసింది. సామాన్యులకు, పెన్షన్‌లపై ఆధారడి జీవించేవారికి ఇబ్బంది కలుగ కుండా ఉండాలనే ఆలోచనతో ఒక రోజు ముందే పెన్షన్‌లు పంపిణీ చేయనున్నట్లు మండల ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు. 30వ తేదీ అనగాశనివారంనాడు అన్ని పంచాయితీల పరిధిలోని పెన్షన్ దారులు అందుబాటులో ఉండి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

● 450 లీట్ల బెల్లం ఊట ధ్వంసం



పట్టుబడిన బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని రామనగర్‌లో నాటుసారా స్థావరాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో తయారీకి సిద్ధం చేసిన సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. దాడులు నిత్యం ఉంటాయన్నారు. సారా తయారీ నేరమని మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సీఐ నాగేశ్వరరావు సహా పలువురు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల అల్పాహారం కోసం గురువు వితరణ

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షకు శిక్షణ పొందే పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటుకు ఉపాధ్యాయిని చెరుకూరి సుజాత రెండు వేల రూపాయలు అందించి వితరణ చాటుకుంది. మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో డిశంబరు 8న జరిగే ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షకు 27 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయులు సాయంత్రం వేళ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు.

పంట నమోదుతోనే ప్రభుత్వ రాయితీలు : ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని బైటమంజులూరు, రామకూరు గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. 2024 - 25 సంవత్సరానికి సంబంధించి రబీలో సాగు చేస్తున్న పంటలను ఫిబ్రవరి 25లోగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి పంట నష్టపోయిన సమయంలో రాయితీ పొందటంతో పాటు సున్నా వడ్డీ పథకం, పంట బీమా వర్తించాలన్నా పంట నమోదు తప్పనిసరి అన్నారు.

రక్షణ గోడలేని వంతెన

● పొంచి ఉన్న ప్రమాదం



ఏబీసీ పరిధిలోని పమిడిపాడు మేజర్‌పై ముప్పవరం వద్ద రక్షణ గోడలేని వంతెన

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పమిడిపాడు మేజర్‌పై రక్షణ గోడలేని వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ముప్పవరం నుంచి బొమ్మనంపాడు వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పమిడిపాడు మేజర్‌పై నిర్మితమైన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ముప్పవరం నుంచి అద్దంకి వెళ్లే ఈ ప్రధాన రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ముప్పవరం గ్రామ రైతులు తమ పంటపొలాల్లో పనుల కోసం నిత్యం ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. పంట పొలాలకు ఎరువులు చేరవేయడంతో పాటు వ్యవసాయ పనుల కోసం, పండిన పంట ఉత్పత్తులు, సుబాబుల్ కర్ర చేరవేసేందుకు ట్రాక్టర్లు ఈ వంతెనపై తిరుగుతంటాయి. వీటితో పాటు అద్దంకి నుంచి ఇటుక, సిమెంట్, ఇతర సరుకులు వేర్వేరు ప్రాంతాలకు తరలించే పలు భారీ వాహనాలు, ప్రజా రవాణా కోసం నడిపే కారులు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో రక్షణ గోడలు లేని వంతెనపై తరచూ వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళ వాహనాల లైట్ల వెలుతురులో మార్జిన్ గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు కాలువలో పడిపోయిన సందర్భాలు కోకొల్లలు అంటే అతిశయోక్తికాదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో పమిడిపాడు మేజర్‌పై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాల బారిన పడకుండా తమకు రక్షణ కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకు



మృతి చెందిన వెంకటేశ్వర్లు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తండ్రిని కొడుకు చంపిన ఘటన అద్దంకిలోని భాగ్యనగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జె.పంగులూరు మండలం కశ్యాపురం గ్రామానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు (60) కుటుంబం మూడు దశబ్దాల క్రితం అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. భార్య 20 సంవత్సరాల క్రితమే చనిపోయింది. రెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి కొడుకు సుబ్బారావు (సుబ్బు)తో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిస అయిన కొడుకు సుబ్బారావుతో తండ్రికి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా తండ్రీ కొడుకులు గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న కుమారుడు తండ్రిపై దాడి చేయగా చెవి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని చీరాల డీఎస్పీ మొయిన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి బంధువు చెంచు రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.



హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యతోనే ఉన్నత స్థానం

మేదరమెట్ల, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల నిర్విరామ కృషితో విద్యార్థులు నేర్చుకున్న విద్యతోనే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని పలువురు విద్యార్థులు నిరూపించారని పలువురు వ్యక్తం తెలిపారు. శుక్రవారం తిమ్మనపాలెంలోని ఆరివారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎస్.హనుమంతరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఇంగ్లీషు బోధన ద్వారా మాత్రమే సామాజిక చైతన్యం వస్తుందన్నారు.

నేడు రెవెన్యూ సదస్సుకు మంత్రి రవికుమార్ హాజరు

మేదరమెట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలంలో రెవెన్యూ సమస్యలపై అధికారులతో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యలున్న వారు తమ సమస్యలను నేరుగా సమావేశంలో నివేదించవచ్చన్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

మార్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో విషయ పరిజ్ఞానం పెంచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు నాసా కిట్లును పంపిణీ చేశారు. నేషనల్ స్పేస్ సొసైటీ, నాసా రీసెర్చ్ సెంటరు సంయుక్తంగా నిర్వహించే నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో ప్రాజెక్టు డిజైన్ చేయడానికి శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దాంతో నాసా సంస్థవారు విద్యార్థులకు నాసా కిట్లును పంపించారు. వాటిని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో వస్రాంనాయక్ చేతుల మీదగా విద్యార్థులకు అందజేశారు.

కుట్టు మిషన్ అందజేత

నాగులుప్పలపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. ఇటీవల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారు చేసి పాఠశాలలు, కళాశాలల్లో చల్లి మొక్కల పెంపకంనకు దోహదడినందుకు గాను ప్రోత్సాహకంగా క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర మండల వాసవీ క్లబ్‌కు మంజూరు చేసిన కుట్టు మిషన్‌ను గురువారం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కోడూరి భారతికి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో అమరా వేణు, పులకణం రాజా, దేసు రవి, సుధాకర్, చంద్రశేఖర్ గుప్త, సామాజిక సేవాకార్యకర్త తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.



వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, వీవోఏలు

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యం

● ఏపీఎం కోటేశ్వరరావు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ లక్షాధికారి అవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రుణ సౌకర్యం కల్పించి, సాంకేతిక శిక్షణ ఇప్పిస్తోందని, వాటిని అందరు సద్వినియోగపర్చుకోవాలని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది సాధించిన ప్రగతి నివేదికలు సమావేశంలో తెలియజేశారు. బ్యాంకు రుణాలు 827 సంఘాలకు రూ.45 కోట్లు, స్త్రీనిధి రుణాలు 208 సంఘాలకు రూ.5.50 కోట్లు, సామజిక పెట్టుబడి నిధి కింద రూ.22.25 లక్షలు ఇప్పించినట్లు తెలిపారు.

సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా

● టీడీపీ బాపట్ల పార్లమెంటు స్థానం మాజీ అధ్యక్షుడు ఏలూరి

మార్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వం తీసుకోవాలని, పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి తెలుగు దేశం పార్టీ కొండంత భరోసా కల్పిస్తుందని పర్చూరు శాసనసభ్యులు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-26 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వచ్చేనెల 2లోపు పూర్తి చేయాలన్నారు. వంద రూపాయలు పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు రూ.5 లక్షలు ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తూ మృతిచెందితే వారి కుటుంబానికి మట్టిఖర్చులు నిమిత్తం రూ.10 వేలు అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించాలని, సభ్యత్వ నమోదు చేయించాలని ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు.

డొంకలను ఆక్రమించి పైర్లను సాగుచేస్తే చర్యలు

తహసీల్దార్ అనిత

కారంచేడు (పర్చూరు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకలను ఆక్రమించి పైర్లను సాగుచేస్తే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదని తహసీల్దార్ అనిత హెచ్చరించారు. ఇలా డొంకలను ఆక్రమించి సాగుచేయటం వల్ల సమీపంలోని రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కారంచేడు గ్రామంలోని ఓ రైతు తమ పంట పొలానికి వెళ్లే డొంకను ఆక్రమించుకొని సాగుచేసుకుంటూ తమ పంట పొలంలోకి వెళ్లేందుకు ఇబ్బంది పెడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయారు. దీనిపై తక్షణమే స్పందించిన తహసీల్దార్ స్వయంగా పొలంలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాలకు ఉండే డొంకలు రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్నవని, వాటిని అక్రమించుకొని సాగుచేస్తే తోటి రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతి

ఇంకొల్లు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నలతోటివారిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా రత్నకుమారి బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. మృతురాలు రత్నకుమారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా కార్తీక వన సమారాధన



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బల్లికురవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అంబడిపూడిలోని దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కార్తీక సమారాధనాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అర్చకులు లక్ష్మయ్య నేతృత్వంలో అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

లారీ డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్సై జి.వి.చౌదరి

బల్లికురవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు- వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బల్లికురవ ఎస్సై జి.వి.చౌదరి నేతృత్వంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అతి వేగం వల్ల కలిగే అనార్థాలు, ప్రమాదాలు జరిగిన తరువాత కలిగే ఇబ్బందులు తదితర అంశాలను వివరించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళకు గాయాలు

స్వర్ణ (పర్చూరు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళకు గాయాలైన సంఘటన గురువారం కారంచేడు - స్వర్ణ రోడ్డులో చోటుచేసుకుంది. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన జి.పద్మ, శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై స్వర్ణ నుంచి కారంచేడు వెళుతుండగా మార్గమధ్యలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పద్మను 108 వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జ్యోతిబా పూలే చిరస్మరణీయుడు

● ఎమ్మెల్యే కొండయ్య



జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలె చిరస్మరణీయుడని, ఆయన ఆలోచనలు నిరంతరం అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలె వర్ధంతి సందర్భంగా స్థానిక గడియార స్థంభం కూడలిలోని ఆయన విగ్రహానికి కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలె అన్ని వర్గాలకు ప్రత్యేకంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వేసిన అడుగులను మననం చేశారు. విద్య ప్రాధాన్యతను ఆనాటి కాలంలోనే వెలుగులోకి తెచ్చిన ఆదర్శ ప్రాయుడన్నారు.

● మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిస్తామని మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు. పూలె వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గడియార స్థంభం సెంటర్‌లోని పూలే విగ్రహానికి వైసీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ పూలె ఆలోచనా సరళి అన్ని వర్గాలకు అనుసరణీయమన్నారు. నేటితరం యువత వారి ఆలోచనలకు అనుగుణంగా ఉండాలని పిలుపునిచ్చారు.

● ఇంకొల్లు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో జ్యోతిబా పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంజి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో నేడు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రెండు గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.